

# నీదయ రాదా దేవీ!

నే నంటే ఎంత నిర్దయ నీకు!

నేను దేవతలందరికీ అధిపతిని! స్వర్గం నా చేతిలో వుంది.

స్వర్గ సుఖాలు నా చేతుల్లో వుంటాయి అలా నవ్వుతావేం? ఔను! స్వర్గసుఖాలు నాచేతుల్లో ఉంటాయి. చేతల్లోనూ వుంటాయి. సుందరీ! నామాటపై నమ్మకం లేదా?

అవున్లే! పిల్లకి చెలగాటం శక్రుడికి ప్రాణసంకటం అని వూరికే అన్నారా? అయినా యీ పూరి గుడిసెలో నీకేం సుఖం వుంది! తలపుల తలుపులు తోట్టే తల్పాలా? మదిలోని కోర్కెల్ని వెలిగించి రగిలించే మణిదీపాలా? తనువుని మరిపించే భోగాలా?

ఏ వున్నాయిక్కడ?

చెట్టూ, చేమా - పుట్టా, బూచీ తప్ప.

నీకు నవ్వులాటగానే వుంటుందిలే!

అక్కడ్నించి యిక్కడికి- యీ పూరిగుడిసెకి దిగజారి దిగబారి దిగి వచ్చానని కదూ యింత చులకన!

ఆఁ నాకు నువ్వంటేనే చులకనా!

ఏం మాట! అదేం మాట! నేను నిన్ను చులకన చేస్తానా? నువ్వేం సామాన్యురాలివా! మాన్యురాలివి. సమ్మాన్యురాలివే!

అవును...నువ్వు

ఘన కచవు శైలకుచవు సైకతనితంబ

వేను, నిను చుల్కగా నెంతునే మృగాక్షి

పంచ కన్యలలో నెన్న ప్రముఖ వీవు...

ఔనా! నిన్ను చులకనగా చూస్తానా సుందరీ మణీ! నువ్వంటే నాకెంత ఆరాధన! ఎంత ఆత్మీయత! ఎంత అనురాగమో ఎలా తెలుస్తుంది నీకు?

అవును. అవన్నీ నీకెలా తెలుస్తాయిలే!

ఈ జడలధారితో కాపురం చేస్తూ ఇల్లలుకుతూ కడవలతో నీళ్లు మోస్తూ మండీ మండని కట్టెలతో పొయ్యి వూత్తూ.... అయ్యో...తలుచుకుంటేనే ఎంత బాధ?

ఇలాంటి పరిసరాల్లో, అలాంటి వాడికి సంతానాన్ని కలిగిస్తూ యవ్వనమంత హోమధూమాలకు ధూపం వేస్తూ... ఎలా జీవిస్తున్నావు! అగడ్తలో పడ్డవారికి అదే వైకుంఠం...అదే స్వర్గం...అట.అవునా?

అయినా, ఒకసారి నాతో మా స్వర్గానికి రారాదూ! అచ్చెరమచ్చెకంటులంతా నిన్ను రెప్పవాల్పులేకుండా చూస్తారు.

అక్కడ-

ఆకాశగంగలో స్నానం చేస్తే జన్మజన్మల మురికి పోతుంది. ఆ కల్పవృక్షం నీడలో ఆ ఫలాలు ఆరగిస్తే ఆ యవ్వనం అక్కడే ఆగిపోతుంది. ఒక్క గుక్క అమృతం పుచ్చుకున్నావో నీకు మతిపోతుంది. ఆకలి దప్పులు లేక, అలసటల్లేక, అవధిలేక, మనసైన వారితో మనసిజ కేళిలో....

వద్దొద్దులే వగలాడీ...ఆ భ్రుకుటి విరుపులొద్దులే!

ఒకమాట విను...

అసలు బ్రహ్మ నిన్నెందుకు సృష్టించాడో తెలుసా?

నాకోసం!

ఆఁ ఆఁ అంతకోపం వద్దులే! జరిగింది చెప్తే నీవే అవునంటావు... ఒకసారి నాకలోకంలో నా సభలో పెద్దగొడవైంది.

ఎందుకు గొడవ అని అడగవేం?

రంభ, చిత్రరేఖ, ఊర్వశి, హరిణి, మేనక, ఘృతాచి తిలోత్తమ....అలా చాలా మంది అప్సరసలు నాట్యమాడుతూ వచ్చి నాముందు నిలిచారు. వాళ్లని చూసి వాళ్లల్లో అందగత్తెలే ఎవరు అని నేనే ఓ సమస్య లేవనెత్తాను.

సవ్యక...

ఏదో ఒక సమస్య లేకపోతే రంజు ఏమిటి?

లోకంలో అబద్ధం ఆడని వాడంటూ ఉన్నాడా అని అడిగితేనే కదా హరిశ్చంద్రుడు సత్య హరిశ్చంద్రుడైంది. అలా సుందరాంగి ఎవరు అని ప్రశ్నిస్తే అక్కడున్న దిశాధిపతుల కుమాళ్లు, గడ్డాల వాళ్లు, మునులు ఎవరి కిష్టమైన పేరు వారు చెప్పారు.

సహజమే కదా! తన కన్నులతో చూసింది తనకు అందంగా కన్పిస్తుంది. అవునా!

అప్సరస లందరిలో ఊర్వశే అందగత్తె అన్నాడు వరుణుడు. సూర్యుడు, పురూరవుడు ఆ మాటే అప్పగించారు అభిమానంతో నలకూబరుడు రంభపేరు చెప్పాడు. నారీషు రంభా అని కదా లోకోక్తి చెప్పాడు విభాండక మహర్షి హరిణిని, విశ్వామిత్రుడు మేనకను ఆకాశానికి ఎత్తారు.

విశ్వామిత్రుడన్నాడు

కన్నులు వేరలన్ కొలువుగాతగు, కొ నరోపవ, పన్నులా
కిన్నెర కాయలం గెలుచు, కీల్జడ బారకు మీరు, మోము క
ప్పున్నమ చందమామ యొక హెలిక, వాలిక తూపు మాపు నా
కన్నుల యాన దాని కెనగాన జగాన మొగాన పల్కాదన్

కొందరు మానవ కాంతలే మిన్న అన్నారు. పరాశరుడు దాశకన్య మత్స్యగంధిని ప్రశంసించాడు. అలా అలా ఎవరి అభిమాని వారి పేరు చెప్పడంతో సభ అంతా రభస అయి గలభా అయి గందరగోళమై సభాపతిని అయిన నా సన్నిధిని కూడా లెక్క వేయకుండా ఎవరికి వారే ప్రతిపాదనలు సాగించారు.

నాకు చిరాకెత్తింది.

ఏ కాంత ఎవరి కితవో ఆ కాంతను వారు పొగడుటది యుక్తంబే! మీకేల వాదుమీలో లోకో భిన్నరుచి.... కదా అన్నా. నా మాటలోని కాకువు అర్థం చేసుకుని మరింత రేగి చెలరేగి ప్రతిపాదించసాగిన దానినే సమర్థించి వాదించసాగారు.

అప్పుడు అందర్నీ శాంతించమని ఇదంతా ఎందుకు అందమైన అమ్మాయిలను యిలలో సృష్టించే ఆ నాలుగు మొగాలవాడినే మొగాన అడుగుదాం పదండి అంటూ దండు వెనకేసుకుని నేనే వెళ్లాను.

ఎన్నేళ్లొస్తేనేం ముసలోడయినా బసిరెడ్డి మేలన్నట్టు ఆ బ్రహ్మయ్య అందర్నీ తీసి పారేశాడు. మీలో ప్రతి ఒక్కడూ మీ అనుభవంలోకి వచ్చిన అందగత్తె అందగత్తె అంటూ ఢంకా బజాయిస్తున్నారు. నిజానికి యీరేడు లోకాల్లో ఏ వంకరా లేని పొంకం వున్న అందగత్తె అసల్లేదు

రంభ ఎన్నగ జడప్రాయ మూర్వశిసల్పు
జీవంబు లేనిది చిత్రరేఖ
వామన పొట్టిది వక్రాంగి శశిరేఖ
హరిణ అటంటేమా ఆడవి మెకము
గానుగరోల్ వాయ కను అత్తిలోత్తమ

పగలు చూచినచో అభాస తార
ధాన్యమాలిని మోము దర్శించిన ఖరంబు
పాండువు మేనిది పుండరీక
నాగకన్య లటంటిమా నడలుకుంటు
తక్కువారల చందంబు తలపనేల
ముజ్జగంబుల లో నున్న మదితలందు
నొచ్చె మొకయింత లేనిది యొకతే లేదు
అని అందర్నీ పేరెత్తి - పేరకు తగినట్టు ఉన్నారే తప్ప పేరునిలిపేలా లేరు. ఇదిగో ఇప్పుడు సృష్టిస్తా చూడండి. ఆ సుందరికి ఏలోపం వుండదు. ఆమెను మించిన అందగత్తె అఖిల లోకాల్లో ఎక్కడా వుండదు వుండబోదు అంటూ సృష్టించాడు.

ఎవరిని?

నిన్ను....

నువ్వప్పుడెట్టున్నావ్?

కులుకు నెమ్మోము, కెమ్మోవి, గుబ్బలు, అరిది ఊరులు, అంగజాడి వింత కైదువుగా దంతి గమనంతో ఇంతుల మేలుబంతిలా ఉన్నావ్

హుఁ ఇప్పుడెట్టున్నావ్?

ఆ అందమెక్కడ?

ఈ రూప మెక్కడ?

అప్పుడనాఘ్రాత పుష్పానివి....ఇప్పుడు...ఎందుకులే అనుకోవడం? అనుకుంటే అదో బాధ...అవునా?

నిన్ను సృష్టించగానే అప్సరసలంతా ...ఎలా అయ్యారో తెలుసా?
వనితను గాంచి రంభ తలవంచె తిలోత్తమ మోము నల్లచే
సెను, శశిరేఖలో కమలె, చేష్టలు తక్కెను చిత్రరేఖ, కా
క నొగిలె హేమ, మై మరపు కాంచె మదాలస, తగ్గ చెందె వా
మన కరగెన్ ఘృతాచి, అవిమానత మేనక కాంచె నెంతయున్
పేరుకు తగిన రీతిగా అవమానం పొందారు.
నిన్ను చూశాను సుందరీ...నా కనిపించింది....
కినిసి కుచాననాంగరుచి గిన్నెలతో నెలతో లతోన్నతిన్

ఘన కచ కంఠ రూపములు కందరమై దరమై రమై క్యమై
గొనబగు వాక్కటీక్షులటు కోయిలకో యిలకో లకోరికో
వనిత! నాసల్ వళుల్ నడుము బాలహరిన లహరిన్ హరిన నగున్

(నీ వక్షోజాలు, ముఖము, శరీరాకృతి...వరసగా గిన్నెలతో, చందమామతో తీగతోనూ, జుత్తు, కంఠం, రూపం క్రమంగా శంఖంతో, లక్ష్మితోనూ, వాక్కు, జఘనం, చూపులు అలాగే కోయిలతో, ఇలతో, నీ నాసలు, నూగారు,నడుము అదే వరుసలో చంద్రవంకను, ప్రవాహాన్ని, సింహాన్నీ పోల్చి చెపితే పోల్చినందుకు కినిసి నవ్వుతాయి. ఎందుకంటే అవి లోకోత్తర అందాలు కానీ నీ అవయవాలు అంతకంటే అందం కాబట్టి)

నేనే నేమిటి? నీకే ఏమిటి? అందరికీ అలాగే అనిపించింది.

నేను చూసిన క్షణంలోనే నువ్వూ నన్ను చూశావు.

ఏం చెప్పను సుందరీ!

నాకు రెండు కళ్ళూ చాల్లేదు. వళ్లంతా కళ్లైతే ఎంత బావుండునన్పించింది. అందం అధిక వ్యామోహం కల్పించింది.

ఈ యింతుల మేల్ బంతి సొగసుల దొంతి నా యింటి యింతి కావాలని ఆశపడ్డాను.

జగముల నన్నిటి నేలుచు అగణిత సౌందర్య విక్రమైశ్వర్యములన్ పొగడొందెడు 'నా' కంటెను మగువకు తగినట్టి వేరె మగడున్ కలడే అనుకున్నాను. నీకోసం శచిని వదిలెయ్యడానికి, ఇంద్రపదవి విడిచెయ్యడానికీ సిద్ధపడ్డాను. చేతులొగ్గి ప్రార్థించాను. కోస కళ్లతో నీ కళ్లల్లో నాపై ప్రతిఫలించే ప్రేమను చూస్తూ ప్రార్థించాను.

సృష్టికర్తా....సృష్టికంతా మేలయిన యీ మేటిని యీ బోటిని నా బోటి వాడికే యివ్వాలి. నా కిచ్చి పెళ్లి చెయ్యవా అన్నాను. ముసలాడు ఉహూఁ అన్నాడు నీకట...నేనట...తగని వాడ్నట...మరి తగిన వాడెవడు? గౌతముడట. అనఘుడు...నైష్ఠికుడునట......

వేదాలు ఎప్పుడూ వల్లించే బ్రహ్మకు వేదవేదాంగాలు అనునిత్యం జిహ్వాగ్రాన నిల్పుకుని నిత్యం వల్లించేవాడే నచ్చడంలో వింతే ముంది! విడ్డూరం ఏముందిలే!

అహల్యా!

నా పురందరత్వం, నా దేవనాయకత్వం, నా శీవి, నాదర్పం, నాదర్పారు, నాభోగం, నా సర్వం.... ఈ దర్భల ముందు, ఆ జడలముందు, ఈ పూరి గుడిసె ముందు, ఆ విభూతి పిండికల్లముందు, ఈ జింక చర్మాల ముందు, పులితోళ్ళముందు, ఆ రుద్రాక్షతావళాల ముందు తేలిపోయి నేను తేలికై పోయాను.

అప్పుడు...నీ సృష్టికర్త ఆ మాటలు...

నీకు నీవె వెష్టించుకొనన్

వనునే? యిప్పుడు నీకి

వ్వనిత పొసగ దరుగు మగుడ వచ్చిన త్రోవన్

అన్నప్పుడు... నీ గుండెల్లో పిడుగులు పడ్డాయి. నీ కోరికలకు సంకెళ్లు పడ్డాయి. నీ ఆశలు అడుగంటాయి. అయినా... తండ్రి ఆజ్ఞకు తలవొగ్గావు. యుగయుగాలుగా స్త్రీకి స్వేచ్ఛలేదు. తండ్రో, భర్తో, తనయుడో శాసిస్తే నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి - అనుకుని - ఆ శాసనానికి తలొగ్గి బలికావల్సిందే కదా! ఇదంతా మేం చేసిన నిర్ణయాలే అంటూ దెప్పి పొడవకు! తనదాకా వస్తేనే కానీ ఎవరికీ ఆ బాధ తెలియదు కాదా!

అందుకే ఆయన ఆజ్ఞకు శిరసొగ్గి, నాకు మనసొగ్గి గౌతమునితో ఏడడుగులూ నడిచి అతనికి వయసొగ్గావు. అయితే....ఒక అచ్చటా? ముచ్చటా? అదనా? ఆమనా? అదో పవిత్రకార్యం ఆయనకి. నిత్య నైమిత్తిక కర్మలు ఎంతో నీతో సంసారమూ అంతే! ఒక్కోసారి నిషిద్ధ కర్మలా నిన్ను దూరం చేసేవాడు. అంతే కానీ కామ్యకార్మలా కామకేళిలో తేలిందెన్నడు?

అలా బుసకొడ్తూ చూడకు!

నువ్వెన్నోసార్లు అనుకున్నావు.

ఈ రోజు అమావాస్య. ఈ రోజు పున్నమి. నేడు సంక్రాంతి పర్వదినాలు రసపర్వాలకు పనికి రావు అనేవాడు. ఈ రోజు విషువు, నేడు వ్యతీపాతం, ఈరోజు వైధృతి, ఇవి పంచాంగ యోగదినాలు కావు అనేవాడు, నేడు మన్వాది, ఈరోజు పితృదివసం, నేడు ఏకాదశి, ఈరోజు ద్వాదశి, నేడు శివరాత్రి, ఈరోజు వ్రతం. ఇవి దైవాలకు పితరులకు అంకితం అనేవాడు. ఇకిప్పుడు ఋతుకాల క్రమం తప్పింది. ఎందుకు యవ్వనం వ్యర్థం. ఈ రోజు వదిలెయ్. నేడు ఓర్చుకో అంటూ ఓదార్చేవాడు అలా రోజులకి రోజులు గడిపేస్తాడీ గౌతముడు.

గడచిన ఘడియ మళ్లీ రమ్మంటే వస్తుందా?

నేడు రేపటి కుంటుందా?

కాలం వెల్లాక కబుర్లకే కాలం కదా!

నిజానికి యజ్ఞవేళల్లో నా గుణాలు విని,

అహల్యాయై జారః అనే వేదవాక్కులు విని నీ అదృష్టాన్ని నిందించుకునేదానివి.
నేనిలా తలపోస్తున్నానని ఆయనకి తెలియదా అనుకునే దానివి.

నా విషయం ఏంటావా?

ఏల సృజించెదవని? నను ఏల సృజించెను బ్రహ్మ దానికీ
లాలిత రూప యౌవన కళా లలితాంగ విలాస విభ్రమం
బేల నొసంగె? బేలతన మేటికి వచ్చె మదీయ బుద్ధికిన్
బాలికతోడ నా మనవి పల్కెడు వారి జగాన కానగా!
కలలో మాత్రు అటన్న నిద్ర యెరుగన్, కన్నార చిత్తర్వునన్
తెలియన్ చూచెద నన్న బాష్పములచే నేత్రాబ్జముల్ క్రమ్మెడిన్
కలయన్ ధ్యానము చేతునన్న మది ఉన్మాదంబు సంధిల్లెడిన్
ఇలలో తాళగరాని తాప మహహా! ఎట్లోర్చెదన్ దైవమా?
విన్నావా అహల్యా!

మీ నరులకు అబ్బిన అదృష్టం! మా దేవతలకు అబ్బని అదృష్టం. కళ్లు మూసి నిద్రపోయి కలలోగని ఆకలలో కరువుతీరా చూద్దామంటే కన్నుమూయుటమే లేని నాకు నిద్రెక్కడిది? ఎంత వేదన అనుభవించానో ఊహించుకో

అహల్యా నీవు ఎప్పుడూ నా చింతలోనే వుండి నిన్నూ నన్నూ కలిపి నిందించుకునేదానివి. నిందకోసమైనా నన్ను నీతో కలుపుకుంటున్నందుకు ఎంతో సంతోషించే వాడిని. అసలు ఆడ పుట్టుకనే తిట్టుకునే దానివి.

అహల్యా! అందుకే వచ్చాను

అంజలిస్తున్నాను

అయిన వాడిని. మనసైన వాడిని. వరసైనవాడిని.

ఎలా అంటావా?

రాజులకు అన్ని భూముల మీదా హక్కుంటుంది.

రాజుకే హక్కులుంటే మరి సురరాజుకు హక్కు లేదంటావా సుందరీ?

అహల్య అంటే దున్నని భూమి అని అని అర్థం కదూ! అలా నాకు అధికారం వచ్చిందంటాను.

నువ్వహల్యవు. సర్వాంగ సుందరివి.

నేను ఇంద్రుడ్ని సర్వలోకాధిపతిని

అన్నిటా నీకు సరిజోడిని.

జోహుకుం అంటూ జోతలుపెడ్తున్నాను

వెతలు పెట్టద్దు. కితకితలు పెట్టు. వలపుతో మొట్టు గెలుపుతో కొట్టు. అదిగో...

నీ పెదవి మీద చిరునవ్వు. నిజానికి నీ అధర సుధా రసం అందుకోకపోతే నాకు అమృతసిద్ధి ఎక్కడుంది?

ఏమంటున్నావ్

రంభకైవడి కంబురాకుల్కు పల్కులో తమికూర్చు వలపులో తారరీతి

ఊర్వశి చందాన డిరపొందు చిన్నెలో రక్త కుల్కుటో మదాలస వితాన

శశిరేఖ అందాన రసకల కళాప్రౌఢా? ఎదురొత్తు లిచ్చుటో హేమ లీల

మంజు ఘోష నిరూఢి మణి తానుకుల్యంబొ మానలీలలో ధాన్యమాలినివలె

నెరితిలోత్తమగతి అతి స్నేహగరిమ

నెనయుటో నాగరిక రీతి ఇంతలేని

తపసి యిల్లాండ్రపై బాళి తగిలి మిగుల

వగల వెందుదురే తమ వంటి దొరలు

అంటున్నావా అహల్యా!

అహల్యా!

నిలునిలుమో లతాంగి! కరుణించవె చంపక గంధి సిగ్గటే

చిలుకల కొల్కి అంజకవె చిత్తజు పూవుల ముల్కి నీ పయిన్

వలచితినే మృగాక్షి! పెరవాడనటే శుకవాణి! ఏ నికన్

నిలువగలేనె చాన నను నీదగు బంటుగ నేలవే చెలీ!

ఆగాగు అహల్యా! కరుణించు! ఎందుకా సిగ్గు చిలుకల కొలికీ! బాధపెట్టకే మన్మధుడి ఆరోబాణమా! నిన్నే వలచానే లేడికన్నుల లోలాక్షీ! నీకు పరాయివాడిని కానే భామా! నిలువలేను... నీ బంటును దాసుడిగా ఏలుకో! దయచూడు!

అమ్మో! ఎంత భాగ్యం! ఎంత అదృష్టం!!

దారి ఇస్తున్నావా జడదారి దారి విడిచి వస్తున్నావా!
ధన్యుడ్ని!
అలాగే!
నీ వన్నట్టే మెలుగుతాను
మనది చాటుమాటు సరసం ! కదా
వన్నెలు చిన్నెలు నిలచేలా నీతో నిలవను
అద్దా! ఏమి నేర్పరివే! ఎంత జాణవు!
నన్ను నియమించి మించి నీవే రమించినావు కదే!

ఔనే ముద్దుల గుమ్మ! చూచి తవునే అందంపు పూరెమ్మ మే
లౌనే చక్కదనాల యిక్క అదె మే లబ్జాస్త్ర వేధక్క! ఔ
నౌనే ఇంతుల మేలుబంతి! భళి! శిస్తానే కళల్ దొంతి! మిన్నౌనే!

ఆహా! యేమి కళాకేళిచాతుర్యం
మూలనున్నట్టి జడదారి ముద్దరాలవు - ఎన్ని చిన్నెలు నేర్చితే యెమ్మెలాడి!
మేలు! మేలు!
వేగు జామయ్యేనే! ఇకపోయివత్తునా!
విరహంతో వేగుతూ ఏగెదనే! మళ్లీ మళ్లీ వస్తాను
రావద్దన్నా రాకుండా వుండగలనా! నీకటాక్షం ఉండాలి కానీ
త్రిలోకధిపతినే కానీ నీ దాసుడనే చెలీ! ఏమంటున్నావ్
నమ్మినదాన నా తనువు నమ్మినదానను నీకు ఇంక నే
అమ్మక చెల్ల! నన్ను విరహాగ్నికి పాల్పడచేసి పోవుటల్
సమ్మతామాయెనా! విడువ చాలితివా? ఎటులైన నిన్ననే
పొమ్మన చాల చాలినను బొందిని ప్రాణములుండనేర్చునే!

అహల్యా! అహల్యా! ఎంతప్రేమనే! నీ ప్రేమామృతం అసలైన అమృతం కంటే మధురమే! అయినా యిక్కడే ఆగగలనా! వెళ్లివస్తా! మళ్లీ వస్తా!

అరే! ఎవరది! గౌతమా! అహఁ అహఁ గౌతమ మహర్షులా! ఇదేం వేషమా! నువ్వెప్పుడొచ్చావ్?

ఏమవుతోంది నాకు. పది మందికీ ఇవి కళ్లా! నాకు చిహ్నాలా! హరహరా! సహస్రాక్షుడ్ని కాలేకపోయానని వగచినందుకు వళ్లంతా గళ్లయ్యాయా?

అదేమి! అహల్యా! అహల్యా నీకు శాపమా? నీకా! అహల్యా నీవు రాయివైతే ఆ రాయిడి నాకు కాదా! రాముడెప్పుడు వచ్చేను. ఆ శ్రీచరణమెప్పుడు సోకేను... శాపవిమోచన మెప్పుడయ్యేను! హా! రామా!